


జల విద్యుత్ జోష్

- శ్రీశైలం, జూరాల జల విద్యుత్ కేంద్రాల్లో భారీగా ఉత్పత్తి
- ప్రాజెక్టులు ముందుగా నిండటమే కారణం
- గతేడాది వర్షాలు లేక ఆరేళ్ల కనిష్ఠానికి పవర్ జనరేషన్
- ఈ ఏడాది ఇప్పటికే శ్రీశైలంలో వద్ద 925 మిలియన్ యూనిట్లు..
- జూరాల వద్ద లోయర్, అప్పర్ కేంద్రాల్లో కలిపి 322 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి
- నవంబరు వరకు వరద సూచనలతో రికార్డు స్థాయిలో ఉత్పత్తి అయ్యే అవకాశం



లోయర్ జూరాల జల విద్యుత్ కేంద్రం

ఐదేళ్ల విద్యుత్ ఉత్పత్తి వివరాలు (మిలియన్ యూనిట్లలో..)			
సంవత్సరం	అప్పర్ జూరాల	లోయర్ జూరాల	శ్రీశైలం ఎడమగట్టు
2019-2020	321.678	318.829	2052.14
2020-2021	370.503	403.073	1217.84
2021-2022	335.013	369.307	2051.04
2022-2023	452.914	432.170	2167.01
2023-2024	101.185	111.640	311.24



శ్రీశైలం ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రం


మహబూబ్‌నగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి జిల్లాలోని మూడు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి జోరుగా కొనసాగుతోంది. వరద వస్తుండటంతో ఉత్పత్తి కూడా నిరంతరాయంగా జరుగుతోంది. మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిపై ఫోకస్ పెంచుతున్న విషయం తెలిసిందే. కర్బన ఉద్గారాల శాతం తగ్గించడానికి సాధ్యమైనంత ఎక్కువగా గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకుంటున్నాయి. గ్రీన్ ఎనర్జీలో ముందుగా చెప్పుకోవాల్సింది జల విద్యుత్. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రవహిస్తున్న కృష్ణానదిపై మూడు జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ఉన్నాయి. వరద వచ్చినన్ని రోజులు వాటి ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయాలనే తలంపుతో అధికారులు ఉన్నారు. అయితే గతేడాది వరద తక్కువగా ఉండటంతో ఆరేళ్ల కనిష్ఠంగా విద్యుత్ ఉత్పత్తి జరిగింది. గత సంవత్సరం లోటు పూడ్చుకునే దిశగా ఈ సీజన్‌లో జెన్‌కో అధికారులు విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. వారి ఆలోచనలకు అనుగుణంగానే ఈ సీజన్‌లో ప్రాజెక్టులు ముందస్తుగా నిండటంతో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమైంది. అప్పర్, లోయర్ జూరాల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల తోపాటు శ్రీశైలం ఎడమగట్టు విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా నిర్విరామంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. నవంబరు చివరి వరకు కృష్ణానదికి వరద రోజులు నమోదయ్యే అవకాశం ఉండటంతో ఈసారి రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ సీజన్‌లో ఇప్పటికే లోయర్, అప్పర్ జూరాల కేంద్రాల్లో 322 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరగ్గా.. శ్రీశైలం ఎడమగట్టు కేంద్రంలో 925 మిలియన్ యూనిట్ల మేర ఉత్పత్తి సాధించారు. ఏటా శ్రీశైలంలో 1,400 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంటుండగా, జనవరి వరకు ఉత్పత్తిని కొనసాగించనున్నారు.

2022-23లో రికార్డు స్థాయిలో..

కృష్ణానదికి 2022-2023 వాటర్ ఈయర్‌లో భారీగా వరద నమోదైంది. ఈ సమయంలో మూడు జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల చరిత్రలో ఎక్కువగా విద్యుత్ ఉత్పత్తి చేశారు. ఆ సంవత్సరం జూరాల వద్ద 1,230 టీఎంసీల వరద నమోదు కాగా.. శ్రీశైలం వద్ద 2,040 టీఎంసీలు నమోదైంది. దీంతో ఉత్పత్తి రికార్డు స్థాయిలో నమోదైంది. ఈ సంవత్సరం కూడా అంతకంటే ఎక్కువ జల విద్యుత్ ఉత్పత్తి నమోదవుతుందని జెన్‌కో అధికారులు అంచనా వేస్తున్నారు. అప్పర్ జూరాల కేంద్రంలో జూలై 17న, లోయర్ జూరాల కేంద్రంలో ఆ తర్వాత రోజు విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించారు. వరద నిర్విరామంగా కొనసాగుతుండటంతో విద్యుత్ ఉత్పత్తిని ఆపడం లేదు. అలాగే శ్రీశైలం వద్ద కూడా జూలై 17న విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించారు. 2022లో శ్రీశైలం ఎడమగట్టు ఉత్పత్తి కేంద్రంలో 2,167 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తితో రికార్డును సాధించగా.. ఈ సంవత్సరం ఇప్పటివరకు 925 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేశారు. 2022లో అప్పర్ జూరాల వద్ద 452.914 మిలియన్ యూనిట్లు, లోయర్ జూరాల వద్ద 432.170 మిలియన్ యూనిట్లు విద్యుత్ సాధించారు. ఈ సంవత్సరం ఇప్పటివరకు రెండు యూనిట్లలో కలిపి 322 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేశారు.

గతేడాది అత్యల్పంగా..

గడిచిన ఆరేళ్ల విద్యుత్ ఉత్పత్తి లెక్కలను పరిగణలోకి తీసుకుంటే.. గతేడాది మూడు జల విద్యుత్ కేంద్రాల్లో అత్యల్పంగా ఉత్పత్తి నమోదైంది. గతేడాది జూరాల వద్ద కేవలం 150 టీఎంసీల వరద మాత్రమే నమోదు కాగా, శ్రీశైలం వద్ద 145 టీఎంసీలు నమోదైంది. దీంతో విద్యుత్ ఉత్పత్తి గణనీయంగా తగ్గింది. శ్రీశైలం ఎడమగట్టు కేంద్రంలో 311.24 మిలియన్ యూనిట్లు మాత్రమే విద్యుత్ ఉత్పత్తి చేశారు. స్టోరేజీ తక్కువగా ఉండటంతో వానాకాలం సీజన్‌లోనే కల్వకుర్తి వంటి ఎత్తిపోతల పథకాల కింద ఆయకట్టు ఎండిపోయిందని రైతులు చెప్పారు. విద్యుత్ ఉత్పత్తి విషయంలో గతేడాది రెండు రాష్ట్రాల మధ్య వివాదం కూడా చెలరేగింది. అదే సమయంలో ఏపీవైపు ఉన్న కుడిగట్టు జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో కేవలం 0.55 మిలియన్ యూనిట్లు మాత్రమే ఉత్పత్తి కావడం గమనార్హం. ఇక అప్పర్ జూరాల జల విద్యుత్ కేంద్రంలో గతేడాది 101.189 మిలియన్ యూనిట్లు మాత్రమే ఉత్పత్తి కాగా.. లోయర్ జూరాల విద్యుత్ కేంద్రంలో 111.640 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. మూడు జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో వరద రోజులు తక్కువగా నమోదు కావడం వల్ల గ్రీన్ ఎనర్జీని ఎక్కువ మొత్తంలో ఉత్పత్తి చేయలేక పోయారు.



వరదతో నిండుకుండలా జూరాల ప్రాజెక్టు

1,800 ఎకరాల్లో.. పంట నష్టం

- అధిక వర్షాలతో దెబ్బతిన్న పత్తి, కంది, మిరప పైర్లు
- తెగుళ్లతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న గద్వాల జిల్లా రైతులు
- పరిహారం కోసం ఎదురుచూపు



గద్వాల మండలం బీరోలులో నీట మునిగిన వరిపైరు పరిశీలిస్తున్న ఏఈవో(ఫైల్)

గద్వాల, సెప్టెంబరు 16: ఇటీవల కురిసిన వర్షాలతో జోగుళాంబ గద్వాల జిల్లాలో 1,800 ఎకరాల్లో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ప్రధాన పంటలైన పత్తి, మిరప, కంది, వరికి నష్టం వాటిల్లింది. మూడు వేల ఎకరాలకు పైగా పంటలు నీట మునగగా, వర్షపు నీటిని త్వరగా బయటకు పంపించడంతో నష్టాన్ని వ్యవసాయ అధికారులు కొంతమేర తగ్గించగలిగారు. దెబ్బతిన్న పంటలకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

దెబ్బతిన్న 1,645 మంది రైతుల పంటలు

అధిక వర్షాలకు జిల్లాలో 1,800 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. ప్రధానంగా పత్తికి 627 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. కంది 583 ఎకరాల్లో, మిరప 260, వరి 217, వేరుశనగ 33, పొగాకు 37 ఎకరాల్లో దెబ్బతిన్నాయి. 1,645 మంది రైతులు నష్టపోయినట్లు వ్యవసాయ అధికారులు గుర్తించారు. పూర్తి వివరాలతో ప్రభుత్వానికి నివేదికను అందించామని చెబుతున్నారు.

వర్షాలకు దెబ్బతిన్న పంటలు

వర్షాలతో నీట మునిగిన పంటలు తెగుళ్ల బారిన పడ్డాయి. ఈ ప్రభావం దిగుబడిపై పడుతుందని అంటున్నారు. పత్తి కమర్షియల్ సీడ్ 1.20 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. కాయలు కాసి, పత్తి పట్టే దశలో వర్షాలు కురువడంతో కాయలు రాలిపోయి. మిగిలిన కాయలు నల్లగా మారాయి. ఎర్ర తెగులు సోకడంతో పెట్టిన పెట్టుబడి కూడా వస్తుందో లేదోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పత్తి తర్వాత అధికంగా సాగు చేసిన కంది పంట ఆశాజనకంగా ఉందని సంతోషిస్తుండగా, వానలు దెబ్బతీశాయి. పంట ఎదుగుదల లేకపోగా, మొక్కలు చనిపోతున్నాయి. ఎండు, ఆకుమచ్చ తెగుళ్ల సోకడంతో దిగుబడిపై తీవ్ర ప్రభా వం చూపనుంది. ఈ ఏడాది పొగాకు కూడా బాగానే సాగు చేయగా, లద్దెపురుగు చేరి పంటను నాశనం చే స్తోంది. ఇవేకాకుండా కూరగాయల తోటలపైనా అధిక వర్షాలు తీవ్ర ప్రభావం చూ పాయి.

ఆల్మట్టి నుంచి శ్రీశైలం వరకు గేట్లు బంద్

- వరద తగ్గుముఖం పట్టడంతో మూసి వేసిన అధికారులు

గద్వాల, సెప్టెంబరు 16 : వర్షాలు తగుముఖం పట్టడంతో కృష్ణానదికి వరద తగ్గిపోవడంతో ఆల్మట్టి ప్రాజెక్టు నుంచి శ్రీశైలం జలాశయం వరకు ఉన్న కృష్ణా ప్రాజెక్టుల గేట్లు మూసుకున్నాయి. కేవలం విద్యుత్ ఉత్పత్తి ద్వారానే నీటి విడుదల కొనసాగుతోంది. సోమవారం ఆల్మట్టికి 26 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా విద్యుత్ ఉత్పత్తి ద్వారా 15 వేల క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారు. నారాయణపూర్‌కు 25 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 24 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. జూరాలకు 36 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా గేట్లు మూసివేసి విద్యుత్ ఉత్పత్తి ద్వారా 27,447 క్యూసెక్కులు శ్రీశైలం ప్రాజెక్టుకు వదులుతున్నారు. తుంగభద్ర ప్రాజెక్టుకు 18 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా గేట్ల ద్వారా 2 వేల క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 4700 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. సుంకేసులకు 13,683 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 11,238 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు 40 వేల క్యూసెక్కులకు ఇన్‌ఫ్లో పడిపోవడంతో గేట్లను మూసివేసి కేవలం విద్యుత్ ఉత్పత్తి ద్వారా 67 వేల క్యూసెక్కులు నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా ప్రస్తుతం 202.04 టీఎంసీల నీరు నిల్వకు చేరుకున్నది.

చెరువులో ఈతకు వెళ్లి విద్యార్థి మృతి



మృతి చెందిన నిశాల్

వనపర్తి రూరల్, సెప్టెంబర్ 16 : ఈతకు వెళ్లి చెరువులో పడి విద్యార్థి మృతి చెందిన ఘటన పట్టణ కేంద్రంలోని నల్ల చెరువులో సోమవారం చోటు చేసుకుంది. గద్వాల జిల్లా హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన వీరన్న, గోవిందమ్మ దంపతుల కుమారుడు నిశాల్ (14) సేయింట్ థామస్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. నాలుగేళ్ల నుంచి హాస్టల్‌లో ఉంటున్నాడు. మధ్యాహ్న సమయంలో భోజనం చేసిన తర్వాత నిశాల్ అతని స్నేహితులు వినోద్, కరణ్, రోహిత్‌తో కలిసి పాఠశాల కంపౌండ్ దూకి దగ్గరలో ఉన్న చెరువులోకి ఈతకు వెళ్లారు. నిశాల్‌కు మాత్రమే ఈత వస్తుంది. మిగతా ముగ్గురు స్నేహితులకు ఈత రాదు. నిశాల్ చెరువులోకి వెళ్లి ఈత కొడుతుండగా ఈతరాని ముగ్గురు స్నేహితులు బయట నిలబడ్డారు. నిశాల్ ఈతకొడుతూ ప్రమాదవశాత్తు చెరువులో మునిగిపోయాడు. గమనించిన ముగ్గురు స్నేహితులు కంపౌండ్ దూకి పాఠశాల ప్రిన్సిపాల్ విన్నయ్యకు సమాచారం అందించారు. ప్రిన్సిపాల్‌కు కూడా ఈత రాకపోవడంతో అదే హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులను పిలిచి చెరువులో వెతికించారు. నిశాల్ మృతదేహం లభ్యమైంది. అంబులెన్స్‌లో మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రికి తరలించారు. విద్యార్థి కుటుంబ సభ్యులకు పాఠశాల యాజమాన్యం ఫోన్‌లో సమాచారం అందించారు. తన కుమారుడు పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే మృతి చెందాడని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

నేడు ప్రజా పాలన దినోత్సవం

- కలెక్టరేట్‌లో పూర్తయిన ఏర్పాట్లు

నాగర్‌కర్నూల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సెప్టెంబరు 17ను పురస్కరించుకుని సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ ఆవరణలో జరిగే జాతీయ పతాకావిష్కరణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సోమవారం కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజా పాలన దినోత్సవంలో భాగంగా మంగళవారం ఉదయం 9:45గంటలకు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ నాగర్‌కర్నూల్, 9:50గంటలకు కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్, అనంతరం 9:55గంటలకు ముఖ్య అతిథి ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి హాజరవుతారన్నారు. 10 గంటలకు జి.చిన్నారెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 10:05గంటలకు ముఖ్య అతిథి సందేశం ఉంటుందన్నారు. అనంతరం ఉదయం 10:30గంటలకు జిల్లాలోని ఆయా పాఠశాలల విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు, 10:50గంటలకు వందన సమర్పణ ఉంటుందని కలెక్టర్ తెలిపారు.







ఆస్తి కోసం..

- తల్లిని ఇబ్బందులకు గురి చేస్తున్న కొడుకు
- ఒక్క పూట మాత్రమే అన్నం
- కొడుకుతో పాటు కోడలు, మనుమడి వేధింపులు
- పోలీసులను ఆశ్రయించిన వృద్ధురాలు
- ముగ్గురిపై కేసు



రత్నమ్మ ఉండే గదిని పరిశీలిస్తున్న ఎస్ఐ శ్రీనివాస్



రత్నమ్మ

గద్వాల క్రైం, సెప్టెంబరు 16: ఆస్తి కోసం తల్లిని ఓ గదిలో ఉంచి, సరిగా అన్నం పెట్టని కొడుకుపై సదరు మాతృమూర్తి పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గద్వాల జిల్లా కేంద్రంలోని బుర్దపేట కాలనీకి చెందిన రత్నమ్మ(70)కు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. ఇద్దరు కుమార్తెలకు వివాహం కాగా, తల్లి కుమారుడు చంద్రశేఖర్ వద్ద ఉంటోంది. కుమారుడితో పాటు కోడలు, మనుమడు ఆమె పేరుపై ఉన్న ఆస్తిని చంద్రశేఖర్ పేరున రాయాలని ఒత్తిడి చేస్తున్నారు. తల్లి ఆస్తిని తనకు కాకుండా కూతుళ్లకు ఇస్తుందని ఇబ్బందులు పెడుతున్నాడు. తల్లిని తను ఉండే ఇంట్లో కాకుండా మరో ఇంటి గదిలో ఉంచాడు. బాగోగులు సరిగా చూడటం లేదు. ఒక పూట మాత్రమే అన్నం పెడుతున్నాడు. కొన్నిసార్లు రత్నమ్మ ఆమె దగ్గర ఉన్న చిన్న ఫోన్ ద్వారా గద్వాలలోని ఓ కూతురుకు సమాచారం ఇవ్వడంతో ఆమె వచ్చి తల్లికి అన్నం పెట్టేది. విషయం తెలుసుకున్న చంద్రశేఖర్ తల్లి దగ్గర ఉన్న ఫోన్ కూడా లాక్కున్నాడు. ఇబ్బందులను సహించలేక తల్లి సోమవారం డీఎస్పీ సత్యనారాయణను ఆశ్రయించింది. ఆయన ఆదేశాల మేరకు పట్టణ ఎస్ఐ శ్రీనివాస్ రత్నమ్మ ఉండే గదిని పరిశీలించారు. ఆమె ఫిర్యాదు మేరకు కుమారుడు చంద్రశేఖర్, కోడలు సుభాషిని, మనుమడు నానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వెళ్లిరా వినాయకా!

మహబూబ్‌నగర్, జడ్చర్లలో సోమవారం వినాయక నిమజ్జనం కనుల పండువగా సాగింది. బై..బై.. గణేశా! అంటూ భక్తులు విగ్రహాల ముందు నృత్యాలు చేశారు. మహబూబ్‌నగర్‌లో మహిళల కోలాటం నృత్యాలు ఆకట్టుకున్నాయి. గడియారం చౌరస్తా వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

- ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్



మహబూబ్‌నగర్‌లో నిమజ్జనానికి తరలుతున్న విగ్రహాలు



మహబూబ్‌నగర్‌లో చక్రం తిప్పుతున్న యువతి



గడియారం చౌరస్తాలో కోలాటం వేస్తున్న మహిళా భక్తులు



క్లాక్‌టవర్ వద్ద వేడుకలకు హాజరైన పట్టణ ప్రజలు



మహబూబ్‌నగర్‌లో నిమజ్జనానికి తరలుతున్న విగ్రహం



నాగసాల చెరువులో వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న కార్మికులు

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే నీట మునిగిన పంప్‌హౌస్

- కల్తీ కల్లు, ఇసుక దందాను అడ్డుకోవాలి
- మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ టౌన్, సెప్టెంబరు 16: పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు వట్టెం రిజర్వాయర్ వద్ద అధికారుల నిర్లక్ష్యంతోనే పంప్‌హౌస్ నీట మునిగిపోయిందని బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీమంత్రి నాగం జనార్దన్‌రెడ్డి ఆరోపించారు. గత ప్రభుత్వానికి పేరు వస్తుందనే అక్కసుతోనే సీఎం రేవంత్‌రెడ్డి పీఆర్‌ఎల్‌ఐ ప్రాజెక్టులో పెండింగ్ పనులను పూర్తి చేయడం లేదని విమర్శించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిని వదిలేసి హైడ్రా పేరుతో హైదరాబాద్ మీద పడి కూల్చివేతలు చేపడుతోందని విమర్శించారు. హైడ్రాను స్వాగతిస్తున్నానని, కానీ ప్రత్యామ్నాయం చూపకుండా పేద, మధ్య తరగతి ప్రజల ఇళ్లను సైతం కూల్చడం సరికాదన్నారు. జిల్లాలో అధికార పార్టీకి చెందిన నాయకులు అక్రమంగా ఇసుక దందాలకు పాల్పడుతుంటే అధికారులు చూసి చూడనట్లు వదిలేస్తున్నారని ఆరోపించారు. అదేవిధంగా విచ్చలవిడిగా మారిన కల్తీకల్లు, గంజాయిలతో యువత జీవితాలు నాశనమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే వీటిపై నిఘాపెట్టి అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కేసరిసముద్రం చెరువు ఆక్రమణకు గురికాకుండా కాపాడాల్సిన బాధ్యత స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్‌పై ఉందన్నారు. డ్రైనేజీ నీరు చెరువులో కలవకుండా మళ్లింపు పనులు వేగవంతం చేసి ఎన్‌జీటీ నిబంధనలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులదరికి రుణమాఫీ చేసి ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ ఎస్ నాయకులు అర్థం రవి, బాలగౌడ్, పాండు, లక్ష్మయ్య, సత్యం, భీముడు తదితరులు పాల్గొన్నారు.

కుమ్మెర పంపుహౌస్ సందర్శన

కందనూలు : నాగర్‌కర్నూల్ మండలంలోని కుమ్మెరలో పీఆర్‌ఎల్‌ఐ పంపుహౌస్‌ను మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నపాటి వర్షానికి మోటార్లు మునిగిపోయిన వెంటనే నీటిని తోడాల్సి ఉందని, ఆలస్యమైతే మోటారులో సమర్థత తగ్గిపోతుందన్నారు. సీఎం ప్రాజెక్టును సందర్శించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాబోయే రోజుల్లో కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఆయనతోపాటు రాజావర్ధన్ రెడ్డి, కృష్ణారెడ్డి, అర్జునయ్య, కుర్మయ్య, భీమయ్య, విష్ణుచారి, భీముడు, సత్యం, శంకర్, సుధాకర్, రాజు, అహ్మద్ తదితరులు ఉన్నారు.



కుమ్మెర పంపుహౌస్‌ను పరిశీలిస్తున్న నాగం జనార్దన్‌రెడ్డి

రాష్ట్రస్థాయి యోగా టోర్నీలో ప్రతిభ



పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 16 : రంగారెడ్డి జిల్లాలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి యోగా టోర్నీలో ఉమ్మడి జిల్లా క్రీడా కారులు పతకాలు సాధించారు. వరుణ్, స్వప్న, బాలమణి, ప్రకాష్ బంగారు పతకాలు, మణిదీప్, చరణ్, తిరుపతి, సాగర్, శ్వేత కాంస్య, శ్రీనిష్, సంజయ్, అఖిల్, మధు, వెంకటేశ్ రజత పతకాలు సాధించినట్లు యోగా సంఘ కార్యదర్శి బాలరాజ్ సోమవారం తెలిపారు. అధ్యక్ష, కార్యదర్శులు రాములు, బాల్‌రాజ్ అభినందించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


నర్సింహులు (ఫైల్)

గండీడ్ , సెప్టెంబరు 16: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలంలోని పగిడ్యాల్‌లో చోటు చేసుకుంది . గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పగిడ్యాల్ చెందిన నర్సింహులు (20) శనివారం పురుగు మందు తాగాడు. కుటుంబీకులు అతన్ని వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆదివారం పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు. నర్సింహులు ఆత్మహత్యకు అప్పులతో పాటు, ప్రేమ వ్యవహారమే కారణమని గ్రామస్తులు చర్చించుకున్నారు.

కోస్గిలో మరో వ్యక్తి..

కోస్గి, సెప్టెంబర్ 16: పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కోస్గి పట్టణంలోని వినాయక్‌నగర్‌కు చెందిన అనంతయ్య (40) ఈనెల 9వ తేదీన పురుగుల మందు తాగాడు. అతడిని హైదరాబాద్‌లోని ఉస్మానియ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. భార్య యశోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటరమణ తెలిపారు.

దేవాలయ కమిటీ మాజీ చైర్మన్ మృతి


శేఖర్‌గౌడ్(ఫైల్)

మహబూబ్‌నగర్, సెప్టెంబరు16: జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డుకాలనీ ఆంజనేయస్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు దగడాల శేఖర్‌గౌడ్(56) సోమవారం ఉదయం మృతి చెందారు. ఆదివారం రాత్రి కాలనీలోని వినాయకుడి నిమజ్జనంలో పాల్గొని ఇంటికెళ్లి నిద్రపోయాడు. ఉదయం 10 గంటలైనా నిద్రలేవకపోవడం తో కుటుంబసభ్యులు తట్టి లేపేందుకు ప్రయత్నించినా కదలకపోవడంతో ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే చనిపోయి నట్లు తెలిపారు. నిద్రలోనే గుండెపోటు వచ్చి చనిపోయి ఉంటారని కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. విషయం తెలుసుకున్న మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను ఓదార్చారు.

బైక్ అదుపు తప్పి బెంగళూరు రైడర్ మృతి


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై మంజునాథ్‌రెడ్డి

కొత్తకోట, సెప్టెంబరు 16 : బైక్ అదుపు తప్పి రైడర్ మృతి చెందిన ఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండల ముమ్మళ్లపల్లి శివారులో చోటు చేసుకుంది. ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. బెంగళూరుకు చెందిన రోహన్ (36) రెండు రోజుల క్రితం హైదరాబాద్ వచ్చాడు. తిరుగు ప్రయాణంలో తన స్పోర్ట్స్ బైక్‌పై సోమవారం బెంగళూరుకు వెళ్తుండగా ముమ్మళపల్లి శివారు జాతీయ రహదారిపై బైక్ స్పీడ్ అదుపు చేయలేక రోడ్డు పక్కన ఉన్న కల్వర్టును ఢీకొన్నాడు. దీంతో 20 మీటర్ల దూరంలో ఎగిరిపడ్డాడు. తలకు ఉన్న హెల్మెట్ ఊడిపోయింది. తలకు బలమైన గాయం కావడంతో ఘటనా స్థలంలోనే రోహన్ మృతి చెందాడు. అతని జేబులో లభించిన ఆధారాలతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై చెప్పారు.

ట్రాక్టర్‌ను ఢీ కొట్టిన బైక్

- ఒకరి మృతి మరొకరికి తీవ్రగాయాలు

అలంపూర్ చౌరస్తా, సెప్టెంబరు 16: జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలంలోని 44వ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంతో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూలు జిల్లా లంజబండా గ్రామానికి చెందిన సుభాన్‌బాషా (22), అబ్దుల్లా కోస్గి ఏరియాలో టిప్పర్ డ్రైవర్‌లుగా పని చేస్తుండేవారు. సోమవారం విధులు ముగించుకుని కర్నూలుకు చేరుకుని అక్కడి నుంచి ఉండవల్లి మండలం, ఇటిక్యాలపాడులో ఉన్న తన మిత్రుడిని కలిసేందుకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో ఉండవల్లి స్టేజి దాటాకా ఉల్లిగడ్డల లోడుతో ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుండి ఢీకొన్నారు. దీంతో ఘటనా స్థలంలోనే సుభాన్‌బాషా మృతి చెందాడు. గాయపడిన అబ్దుల్లాను కర్నూలు ఆసుపత్రికి తరలించారు. సుభాన్‌కు మూడేళ్ల కుమారుడు ఉండగా ప్రస్తుతం భార్య గర్భిణి అని, అబ్దుల్లా భార్య కూడా గర్భిణి ఉన్నట్లు తెలిసింది.

సమ్మె విరమించిన పారిశుధ్య కార్మికులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మహమ్మదాబాద్, సెప్టెంబరు 16 : జీతాలు అందలేదని మూడు రోజులుగా మహబూబ్ నగర్ జిల్లా మహమ్మదాబాద్ పంచాయతీ పారిశుధ్య కార్మికులు చేపట్టిన విరమించారు. సోమవారం వేతనాలు ఇచ్చేందుకు అధికారులు అంగీకరించారు. పంచాయతీలో పని చేస్తున్న 15 మందికి మొత్తం రూ.11 లక్షలు, 12 నెలల జీతం రావాల్సి ఉంది. కార్మికులకు మద్దతుగా సీఐటీయూ, ఇతర సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. సోమవారం 'పేరుకుపోయిన చెత్త.. సమ్మెలో పారిశుధ్య కార్మికులు' శీర్షికన ఆంధ్రజ్యోతి దినపత్రిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సీఐటీయూ నాయకులు, కార్మికులతో ఫోన్‌లో మాట్లాడి సమ్మె విరమించాలని సుచించారు. అదేవిదంగా వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. కార్మికులతో పంచాయతీ కార్యదర్శి మాట్లాడి, మూడు రోజుల్లో వేతనాలు చెల్లిస్తామని చెప్పడంతో సమ్మె విరమించారు.

గిరిజన తండాల రైతులకు భూపట్టాలు ఇవ్వాలి


పంట పొలాలను పరిశీలిస్తున్న నాయకులు

ఖిల్లాఘణపురం, సెప్టెంబరు 16 : వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండలంలోని కర్నెతండా, మామిడిమాడ, వెనికితండా, ముందరితండాలలో గిరిజన లంబాడ రైతులు 200ఏళ్లగా సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్న వారికి భూపట్టాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు, కార్యదర్శి ఆంజనేయులు, పరమేశ్వరచారి డిమాండ్ చేశారు. సోమవారం క్షేత్రస్థాయిలో గిరిజన రైతులు దున్నుకునే భూములను పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. దాదాపుగా 780 కుటుంబాలకు నేటికీ భూపట్టాలు ఇవ్వకుండా అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. గిరిజన తండాల చుట్టూ ఉన్న భూములను ఐదు తరాల క్రితం వారి వారసులు చెట్లు కొట్టుకొని 200 ఏళ్ల నుంచి దాదాపుగా 463 ఎకరాల భూములను సాగు చేస్తున్నారని గుర్తు చేశారు. సీలింగ్ చట్టాలు, భూదాన చట్టాలు అమలులోకి వచ్చి భూస్వాముల పేర్లపై ఉన్న 463 ఎకరాల వ్యవసాయ భూమికి సీలింగ్ చట్టాన్ని వర్తింపజేయడం లేదన్నారు. భూదాన కార్యక్రమాలను చేపట్టకుండా ప్రజా పాలన ప్రజాప్రతినిధి వ్యవస్థలోనైనా పేదలకు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశరు. కార్యక్రమంలో అజయ్, గిరిజన రైతులు పాల్గొన్నారు.

పేదల గొంతుక కమ్యూనిస్టులే..



మాట్లాడుతున్న శ్రీరామ్

పాన్‌గల్, సెప్టెంబరు 16 : పేద ప్రజల గొంతుక కమ్యూనిస్టులేనని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరామ్ అన్నారు. సోమవారం వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలంలోని వెంగళాయిపల్లిలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహించి అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టుల పోరాటమే ప్రజలకు నిజాం, భూస్వాముల నుంచి విముక్తి లభించి దేశంలో తెలంగాణ విలీనమైందన్నారు. అదే స్ఫూర్తితో పేదలకు భూములు, ఇళ్లు, పింఛన్లు, రుణాలు తదితర సంక్షేమ పథకాలు శాశ్వత అభివృద్ధి కోసం ప్రజలు పోరాడాలన్నారు. పేదల హక్కుల రక్షణకు సీపీఐ నిరంతరం పోరాడుతుందన్నారు. గ్రామాల్లో రైతులు, కూలీలు పాలక పక్షాలపై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

నిజాం తుపాకీకి ఎదురొడ్డి

- అమరులైన ఐదుగురు అయిజ వాసులు
- లేవి ఉద్యమంలో చురుకైన పాత్ర



బాంబు దాడికి గురైన పాత పోలీస్‌స్టేషన్

అయిజ, సెప్టెంబరు 16 : రజాకార్ల అహంకార దురాగత ఆకృత్యాలను ఎదురించి వారి తుపాకి గుండ్లకు ఎదురొడ్డి ప్రాణాలు విడిచారు. 12 డిసెంబరు, 1947లో లేవి ఉద్యమ సమయంలో అయిజలో ర జాకార్లు జరిపిన కాల్పుల్లో ఐదుగురు అమరులయ్యారు.

లేవి నిరాకరణ

1947-48లో తీవ్ర కరువు కాటకాలు సంభవించాయి. వేసిన పంటలు వట్టిపోయి తినటానికి తిండిగింజలు దొరకని కాలమది. పశుగ్రాసం దొరకక పశువులు, తిండిగింజలు దొరకక ప్రజలు అల్లాడుతున్న వేళ నిజాం సర్కార్ లేవి (ధాన్యం) పన్ను ప్రవేశపెట్టింది. అప్పటికే జుట్టు పన్నుతో జనం వేశారిపోయారు. పన్ను చెల్లించి తీరాల్సిందేనంటూ ఒత్తిడి చేశారు. మహిళలపై లైంగికదాడులు, ఇతరులపై హింసాకాండ, పశుపక్షాదులను పన్నుల కింద బలవంతంగా తీసుకెళ్లటం లాంటి దౌర్జన్యాలు, దమన కాండలకు దిగారు. నిజాం సంపదను పెంచేందుకు చమటను నెత్తురుగా చిందించి జీవచ్ఛవంలా బతుకుతున్న వారు రగిలిన గుండెతో పిడికిలి బిగించారు. లేవి(ధాన్యం) పన్నుకు వ్యతిరేకంగా అయిజ వాసులు ప్రాణాలకు తెగించి పోరాడేందుకు సిద్ధపడ్డారు. నిఘా సమాచారంతో అప్రమత్తమైన నవాబు అయిజ ప్రజలను అణచివేసేందుకు వందమంది పోలీసులను, 300 మంది అరబ్బు దళాలకు ఆయుధాలు చేతికిచ్చి అయిజ పంపారు. అయినప్పటికీ ప్రజలు నిజా సైన్యాన్ని ఏమాత్రం భయపడక తిరగబడ్డారు. ప్రజలు రాళ్ళు, కర్రలు, కారంపొడితో ఎదురు తిరిగారు. రజాకార్లు పన్నులు కట్టి తీరాల్సిందే నంటు బలవంతపు వసూళ్లకు దిగారు. ప్రజలు ఎదురు తిరగటంతో వారు జరిపిన కాల్పుల్లో ఐదుగురు చనిపోయారు. అంతటితో వదలక రజాకార్లు దాదాపు 300 మంది తిరుగుబాటుదారులకు కాళ్లకు, చేతులకు ఇనుప సంకెళ్లు వేసి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న గద్వాలకు కాలి నడకన తీసుకెళ్లారు. అనంతరం నడిగడ్డ తెలంగాణ పోరాటయోధులు కూడగలిపి అయిజ పోలీస్‌స్టేషన్‌పై బాంబులు వేశారు. తదనంతరం ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి పల్లెలోనూ లేవి నిరాకరణ ఉద్యమం విజయవంతమైంది.

అయిజలో శిలాఫలకం ఏర్పాటు



గాంధీ విగ్రహం కింద అమరుల శిలాఫలకం

1947-48లో హైదరాబాద్ విలీనోద్యమం సమయంలో 12 డిసెంబరు 1947లో లేవి నిరాకరణ ఉ ద్యమం జరిగింది. ఎదిరించినందుకు రజాకార్లు జ రిపిన కాల్పులలో అయిజలో నాయకి చిన్న తిమ్మ ప్ప, కల్లె బీచిగాడు, కొండాపురం నర్సప్ప, పాగుంట వెంకటయ్య, బలిజ నాగయ్య మృత్యువాత పడ్డారు. వారి గుర్తుగా చనిపోయిన స్థలంలో పాత పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా గాంధీ విగ్రహం కింద వారి శిలాఫలకం ఏర్పాటు చేశారు.

హ్యాండ్‌బాల్ పోటీలో ద్వితీయస్థానం



ద్వితీయ స్థానం సాధించిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు

జడ్చర్ల, సెప్టెంబరు 16 : వరంగల్ జిల్లాలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో 14, 15వ తేదీలలో జరిగిన అంతర్ జిల్లాల రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు ద్వితీయస్థానంలో నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో ఆదిలాబాద్ జిల్లా జట్టుతో తలపడింది. ఆదిలాబాద్ జిల్లా జట్టు 27 గోల్స్, మహబూబ్‌నగర్ జిల్లా జట్టు 26 గోల్స్ సాధించగా, ఒక్క గోల్ తేడాతో ద్వితీయ స్థానం దక్కించుకుని, సిల్వర్‌మెడల్ పొందారు. హ్యాండ్‌బాల్ అసోసియేషన్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలత్రిపురసుందరి, శంకర్‌నాయక్‌లతో పాటు అసోసియేషన్ కార్యవర్గం అభినందనలు తెలిపారు.

పలు కారణాలతో నలుగురి ఆత్మహత్య

వడ్డేపల్లి, సెప్టెంబరు 16 : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు కారణాలతో నలుగురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. మద్యానికి బానిసై ఉరేసుకొని ఇద్దరు, పురుగు మందు తాగి మరో ఇద్దరు బలవన్మరణానికి పాల్పడ్డారు. జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలంలోని జూలకల్లు స్టేజి సమీపంలో నివాసముంటున్న జగన్(22) సోమవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై సంతోష్ తెలిపారు. మద్యానికి బానిస కావడంతో ఉరి వేసుకున్నాడని తండ్రి రాఘవేంద్ర శెట్టి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి వృద్ధుడు..

తిమ్మాజిపేట: నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం లోని బుద్ధసముద్రం చెందిన చెరుకుల నారాయణగౌడ్(70) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... అతనికి కుమారుడు, కుమార్తె ఉండగా, కుమారుడు పదేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో ఆయన అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమిసంహారక మందు తాగగా, చుట్టు పక్కల వారు గమనించి వ్యవసాయ పొలం వెళ్లిన భార్య, కూతురుకు సమాచారం ఇచ్చారు. వెంటనే వారు జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కూతురు చిలువేరు అనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జడ్చర్లలో మరో వ్యక్తి..

జడ్చర్ల: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మునిసిపాలిటీలోని రైల్వేస్టేషన్ సమీపంలోని రైస్‌మిల్లు సమీపంలో చెట్టుకు ఉరివేసుకొని ఆంద్రె శ్రీశైలం(45) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ ఆదిరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. శ్రీశైలం భార్య, పిల్లలు హైదరాబాద్‌లో నివాసం ఉంటుండగా, ఓ రైస్‌మిల్లులోని ఫర్టిలైజర్ గోదాము వద్ద వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి మిల్లు ప్రాంగణంలో ఉన్న చెట్టుకు తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తాగుడుకు అలవాటు పడి, మానసికంగా బాధపడుతూ ఆత్మహత్యకు పాల్పడ్డాడని, తన తండ్రి మృతిపై ఎలాంటి అనుమానం లేదంటూ కుమారుడు శివకుమార్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

మనస్తాపంతో యువకుడు..


నరేష్ (ఫైల్)

మానవపాడు: మనస్తాపానికి గురై యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడు మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై చంద్రకాంత్ తెలిపిన వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన నరసింహులు కుమారుడు నరేష్(22) డిగ్రీ వరకు చదివాడు. ఉన్నత చదువులు చదవకుంటే పొలం పనులు చూసుకోవాలని తండ్రి మందలించాడు. దీంతో నరేష్ ప్రతి రోజు పొలం పనులు చేసేవాడు. ఈ క్రమంలో సోమవారం పత్తి పంటకు ట్రాక్టర్‌తో మందు పిచికారి చేసిన అనంతరం మరో మిర్చి పంట వద్ద గడ్డిమందు పిచికారి చేస్తానని చెప్పి పొలం వద్దకు వెళ్లి గడ్డి మందు తాగేశాడని, తాగిన తర్వాత కుటుంబసభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. వారు పొలం వద్దకు వెళ్లి నరేష్‌ను స్థానికి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం కర్నూల్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధయలో మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కుంటుంబ సభ్యుల ఫిర్యాదు మేకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సింగోటం ఆలయ హుండీ లెక్కింపు


ఆలయంలో హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

కొల్లాపూర్, సెప్టెంబరు 16 : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని సింగోటం లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీ లెక్కింపు సోమవారం నిర్వహించారు. ఈ లెక్కింపును ఆలయ ట్రస్టీ చైర్మన్ సురభి బాలాదిత్య లక్ష్మణ్ రావు, ఈవో రంగారావు పర్యవేక్షించారు. రూ.10,29,523 నగదు, 1,200గ్రాముల వెండి వచ్చినట్లు ఈవో తెలిపారు. ఈ సంవత్సరం మార్చి నుంచి సెప్టెంబరు వరకు ఆలయాన్ని సందర్శించిన భక్తులపరంగా హుండీ ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరమ్మ, జూనియర్ అసిస్టెంట్ జైపాల్‌రెడ్డి, చంద్రశేఖర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాగు దాటేందుకు ఇక్కట్లు

- పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్న రైతులు
- వంతెన నిర్మించాలని డిమాండ్


ప్రవహిస్తున్న దేదినేనిపల్లి వాగు

పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 16 : నిండుగా ప్రవహిస్తున్న వాగును దాటి వ్యవసాయ పొలాలకు వెళ్లి పనులు చేసుకునే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పట్టించుకునే నాథుడే దిక్కులేదు. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం మరికల్, దేదినేనిపల్లి మధ్య వాగు ఉంది. మరికల్ చెందిన దాదాపు 70మంది రైతులు పొలాలు వాగు అవతలి భాగంలో ఉన్నాయి. వర్షాకాలం రాగానే వాగు నిండుగా ప్రవహిస్తుంది. అంతేకాక కేఎల్ఐ నీరు కాల్వల ద్వారా విపరీతంగా వస్తుంది. రైతులు, వ్యవసాయ కూలీలు నిత్యం నీటిలో వాగు దాటి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాగు నిండుగా ప్రవహించే సమయంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని దాటాల్సిందే. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు తక్షణమే స్పందించి వాగుపై వంతెన నిర్మించాలని కోరుతున్నారు.

భయంతో వాగు దాటుతున్నాం



నిత్యం వాగు దాటి పొలాలకు పనులు చేసేందుకు భయం భయంతో వాగు దాటి వెళ్తున్నాం. వాగులో నడుము లోతుకు పైగా నీరు ప్రవహిస్తుండడంతో కొట్టుకుపోతామనే భయం ఉంది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వాగు దాటి వెళ్లి వ్యవసాయ పనులు ముగిసిన తర్వాత ఇంటికి తిరిగి వస్తున్నాం.

- కావలి, నరేష్, రైతు, మరికల్

వంతెన నిర్మాణం చేపట్టాలి



ప్రతిరోజు మరికల్ నుంచి దాదాపు 70మంది రైతులు, మహిళలు వాగు దాటి వ్యవసాయ పనులు కోసం వెళ్తుంటారు. రైతుల భూములు వాగు అవతలి ఒడ్డున ఉన్నాయి. మరికల్ నుంచి దేదినేనిపల్లి, దేదినేనిపల్లి నుంచి మరికల్ వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నాం. రైతులు రెండు గ్రామాల ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వంతెన నిర్మాణం చేపట్టాలి.

- బొల్లె జగన్, మరికల్

దేవాలయంలో హుండీ చోరీ


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ ఆదిరెడ్డి

జడ్చర్ల, సెప్టెంబరు 16 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం గొల్లపల్లి సమీపంలోని మలయాళస్వామి లలితాంబిక తపోవనంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. తపోవనం ప్రహరీపై నుంచి దూకి వచ్చిన ఇద్దరు, అమ్మవారి ఆలయంలో శ్రీచక్రం వద్ద ఉన్న హుండీని బయటికి పడేశారు. అనంతరం హుండీలో భక్తులు వేసిన నగదును తీసుకుని, ఖాళీ హుండీని అక్కడే వదిలిపెట్టి పారిపోయారు. ఇద్దరు వ్యక్తులు ముఖానికి ముసుగు వేసుకుని హుండీని చోరీకి పాల్పడినట్లుగా సీసీ కెమెరాలో రికార్డయ్యింది. ఘటనా స్థలాన్ని సీఐ ఆదిరెడ్డి పరిశీలించారు. నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుంతను తప్పించబోయి..

- కాలువలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్


ట్రాక్టర్‌ను బయటకు తీస్తున్న రైతులు

బిజినేపల్లి, సెప్టెంబరు 16 : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని మంగనూర్, లట్టుపల్లి రోడ్డు మధ్యలో పడ్డ గుంతను తప్పించబోయిన ట్రాక్టర్ డ్రైవర్ తిరుపతయ్య అదుపుతప్పి కాలువలోకి దూసుకపోయిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. కాలువ నీళ్ల వెళ్లేలా వేసిన సిమెంట్ పైపు పగిలి రోడ్డు మధ్యలో పెద్ద గుంత పడింది. ఎదురుగా వాహనం రావడంతో గుంతలో పడకుండా తప్పించబోయి వరి నారుతో వెళ్తున్న ట్రాక్టర్ కాలువలోకి దూసుకుపోయింది. బోల్తా పడే ప్రమాదం ఉందని గుర్తించి ప్రాణభయంతో డ్రైవర్ కిందకు దూకాడు. రోడ్డుపై పడ్డ గుంతలకు మరమ్మతు చేపట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

వసతి గృహంలోకి చొరబడ్డ అంగతకులు

- సిబ్బందిపై దాడి, కేసు నమోదు

మహమ్మదాబాద్ సెప్టెంబరు 16 : సాంఘిక సంక్షేమ గురుకుల వసతి గృహంలోకి ఆదివారం అర్ధరాత్రి ఇద్దరు వ్యక్తులు చొరబడిన చేసిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండలంలో చోటు చేసుకుంది. వసతి గృహం సిబ్బంది మహేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి సోమవారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన అజయ్, పవన్‌కుమార్ రాత్రి మండల కేంద్రంలోని బాలికల వసతి గృహంలోకి ప్రవేశించారు. అక్కడే విధుల్లో ఉన్న మహేశ్వరి రాత్రి వేళ ఎందుకొచ్చారని ప్రశ్నిస్తే దాడికి పాల్పడ్డారని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మాదాసి, మదారి ఉద్యోగ సంఘం కన్వీనర్‌గా నాగరాజు

పాలమూరు, సెప్టెంబరు 16: మాదాసి, మదారి కురువ ఎస్సీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్‌గా కె.నాగరాజును నియమించినట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు ధన్వాడ రాములు సోమవారం ప్రకటనలో తెలిపారు. కో-కన్వీనర్‌గా జోగు శ్రీశైలంతోపాటు సభ్యులను నియమించారు. సంఘాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని అధ్యక్షుడు సూచించారు.

నవోదయ ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు పెంపు

బిజినేపల్లి, సెప్టెంబరు 16 : నాగర్‌కర్నూల్ జిల్లా వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశ పొందేందుకు నిర్వహించే పరీక్ష దరఖాస్తుకు గడువును ఈనెల 23 వరకు పొడిగించినట్లు సోమవారం ప్రిన్సిపాల్ పి.భాస్కర్ కుమార్ తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా 5వ తరగతి చదువుతున్న అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

భూత్పూర్, సెప్టెంబరు 16: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లుగా ఎస్సై చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలోని పోతులమడుగు చెందిన గుద్దెటి రవికుమార్ తన సొంత ట్రాక్టర్‌లో అదే గ్రామ శివారులో ఉన్న వాగులో ఇసుకను తరలిస్తుండగా పోలీసులు దాడి చేశారు. అనుమతి పత్రాలు చూయించమని అడుగగా డ్రైవర్ పారిపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు పట్టుకుని, ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బీట్ విధులు నిర్వహిస్తున్న రంజిత్‌కుమార్‌గౌడ్, శేఖర్‌చారి ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కారు బోల్తా

- ఇద్దరికి గాయాలు

అలంపూర్ చౌరస్తా, సెప్టెంబరు 16 : జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలంలోని ఇటిక్యాలపాడు శివారులో జాతీయరహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే... వెస్ట్‌బెంగాల్‌కు చెందిన రామానుంజ్ బెనర్జి కుటుంబంతో కలిసి వృత్తి రీత్యా మహారాష్ట్ర నాగపూర్‌లో ఉంటున్నారు. కుటుంబంతో పాటు మిత్రుడు, అతని కుటుంబ సభ్యులతో పాండిచ్చేరి వెళ్లివస్తూ తిరుపతి దర్శనంతరం ఆదివారం రాత్రి తిరుగుప్రయాణం అయ్యారు. ఇటిక్యాలపాడు శివారులోని షేర్ దాభా వద్ద సోమవారం ఉదయం ప్రయాణిస్తున్న వీరి కారు టైరు పగిలిపోవడంతో పల్టీలు కొట్టుకుంటూ బోల్తా పడింది. దీంతో బెనర్జి భార్య అంతర, కూతురు అద్వితీయకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్ లో కర్నూలు ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో కారులో మొత్తం ఆరుగురు ఉన్నారు. కారు నడుపుతున్న బెనర్జీ మిత్రుడు జినేష్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యంత్ర సాంకేతిక పరిజ్ఞానానికి ఆద్యుడు విశ్వకర్మ

- ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్ రెడ్డి



విశ్వకర్మ ఆలయ ప్రాంగణంలో చిత్రపటానికి పూలమాలతో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్ రెడ్డి

బిజినేపల్లి, సెప్టెంబరు 16 : ప్రపంచంలోని మానవాళి వినియోగిస్తున్న యంత్ర సాంకేతిక పరిజ్ఞానానికి ఆద్యుడు విశ్వకర్మ అని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఆనందగిరి గుట్టపై నిర్మాణంలో ఉన్న ఆలయంలో మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం వినియోగిస్తున్న ప్రతీ వస్తువు తయారీకి విశ్వకర్మ అందించిన జ్ఞానం ద్వారానేనని కొనియాడారు. విశ్వకర్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విశ్వబ్రాహ్మణులు విశ్వకర్మ చిత్రపటాన్ని భజనలు, కీర్తనలు, ఆటపాటలతో పురవీధుల్లో కనుల పండవగా ఊరేగించారు. విశ్వబ్రాహ్మణులు శ్రీకాంతాచారి, శంకరాచారి, ప్రభాకరాచారి, సత్యంచారి, వీరాచారి, కృష్ణామాచారి, నారాయణాచారి, శిల్పశ్రీను, కపిలవాయి శేఖర్, వర్ధాచారి, ప్రవీణ్ చారి, శివచారి, మల్లేష్, బాలకృష్ణ, శివకుమార్, జగదీష్, నరేష్, ఉదయ్, కాంగ్రెస్ మండల నాయకులు మిద్దె రాములు, అవంతి, అమృత్ రెడ్డి, కత్తె ఈశ్వర్, బాలపీరు, బంగారి పర్వతాలు, ముక్తార్, భగవంత్ గౌడ్, శ్రీను తదితరులు ఉన్నారు.

క్లాస్‌మేట్ క్లబ్ సేవా కార్యక్రమాలకు అండగా ఉంటా

కందనూలు: క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు నిర్వహించే సేవా కార్యక్రమాలల్లో ఎమ్మెల్యేగా తాను అండగా ఉంటానని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని తీగల వెంకటస్వామి ఫంక్షన్ హాల్‌లో క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాసులుతోపాటు సన్మాన గ్రహీతలు, పలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గెలిచినా ఓడినా నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేయాలి



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మాట్లాడుతున్న బీజేపీ సభ్యత్వ నమోదు జిల్లా ఇన్‌చార్జి కొప్పు బాషా

అచ్చంపేటటౌన్, సెప్టెంబరు16: రాజకీయాల్లో గెలిచినా ఓడినా నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేయాలని బీజేపీ సభ్యత్వ నమోదు జిల్లా ఇన్‌చార్జి కొప్పు బాషా అన్నారు. సోమవారం పట్టణంలోని ఎస్‌జీ బ్యాంకెట్ హాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీ రాములుతో ఆయన కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం గెలిచినా గెలవకపోయినా పదవి ఉన్నా లేకపోయినా జీవితాన్ని ధార పోసిన త్యాగధనులైన కార్యకర్తలు ఉన్న పార్టీ బీజేపీయేనన్నారు. ప్రతీ మూడు సంవత్సరాలకు ఒకసారి పార్టీ అధ్యక్షుడు మార్పు చేసే ఏకైక పార్టీ బీజేపీ అన్నారు. ఎంపీ ఎన్నికల్లో ఊహించని మోజారిటీ ఇచ్చి రాష్ట్రంలో 8మంది ఎంపీలను గెలిపించి ఇచ్చిన ఘనత తెలంగాణ ప్రజలదన్నారు. రాష్ట్రంలో బీజేపీకి 77లక్షల ఓట్లు వచ్చాయని, రాబోయే రోజుల్లో ప్రభుత్వ ఏర్పాటుకు సంకేతమన్నారు. 50 లక్షల మంది సభ్యత్వమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలన్నారు. బీజేపీ నాయకులు కట్టా సుధాకర్ రెడ్డి, సోలంకి శ్రీనివాస్, నరేందర్ రావు, మాంగ్య నాయక్, గంగిశెట్టి నాగరాజు, కొండల్ రెడ్డి, సైదులు యాదవ్, గణేష్ మోడీ, వెంకట్ శెట్టి, చందులాల్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

- ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కశిరెడ్డి నారాయణరెడ్డి

వెల్దండ, సెప్టెంబరు 16 : ప్రభుత్వ ఆస్పత్రులలో మెరుగైన వైద్యసేవలు అందేలా సిబ్బంది చూడాలని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఎమ్మెల్యే తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ఉన్న వైద్యసిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. వైద్యసిబ్బంది ఎల్లప్పుడు రోగులకు అందుబాటులో ఉండి వారి నమ్మకాన్ని చూరగొనాలని అన్నారు. నాయకులు మట్ట వెంకటయ్యగౌడ్, సంజీవ్‌కుమార్, మోతీలాల్, కేశమళ్ల కృష్ణ, రషీద్, నారాయణ తదితరులు ఉన్నారు.

చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని వినియోగించుకోవాలి



చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలోని చేప పిల్లలను పరిశీలిస్తున్న మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు వాకిటి ఆంజనేయులు

బిజినేపల్లి, సెప్టెంబరు 16 : జిల్లాలోని మత్స్య సహకార సంఘాల సభ్యులు అందుబాటులో ఉన్న చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని వినియోగించుకొని లబ్ధిపొందాలని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు వాకిటి ఆంజనేయులు అన్నారు. మండలంలోని ఖానాపూర్ గ్రామంలో 60 ఎకరాల్లోని చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా డైరెక్టర్లతో కలిసి పరిశీలించి మాట్లాడారు. ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు జిల్లాలోని అన్ని చెరువులు, కుంటలు జల కళ సంతరించుకున్నాయన్నారు. గతంలో ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి నుంచి వ్యయ ప్రయాసాలకు ఓర్చి చేప పిల్లలను తెచ్చుకునేదని అన్నారు. చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం జిల్లాలోనే ఉండటంతో నాణ్యమైన చేప పిల్లలను తక్కువ ఖర్చుతో పొందవచ్చని సంతోషం వ్యక్తం చేశారు. ఈ అవకాశాన్ని మత్స్యకార సంఘాలు వినియోగించుకొని లబ్ధిపొందాలని కోరారు. ఆయన వెంట జిల్లా ఉపాధ్యక్షుడు తుమ్మల అల్లోజీ, డైరెక్టర్లు మస్కూరి బంగారయ్య, వేమ వెంకట్రాములు, నరసింహ, వెంకటయ్య, బానుచందర్ ఉన్నారు.

మాజీ మంత్రి లక్ష్మారెడ్డిని పరామర్శించిన డీకే అరుణ

తిమ్మాజిపేట, సెప్టెంబరు 16 : మాజీ మంత్రి చర్లకోల లక్ష్మారెడ్డిని మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే.అరుణ సోమవారం పరామర్శించారు. డాక్టర్ లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతారెడ్డి ఇటీవల మృతి చెందారు. తిమ్మాజిపేట మండల పరిధిలోని ఆవంచ గ్రామానికి వెళ్లి ఆయన స్వగృహంలో లక్ష్మారెడ్డిని పరామర్శించి ఓదార్చి ఆమె చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా పరామర్శించిన వారిలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ మంత్రి బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు నాగం జనార్దన్‌రెడ్డి, బీజేపీ నాయకురాలు బాలాత్రిపుర సుందరి, వెంకటేశ్, సాహితీరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకట్రామిరెడ్డి, మల్లయ్యగౌడ్, శ్రీనివాస్ బహదూర్, మాధవులు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రవక్త చూపిన మార్గమే అనుసరణీయం

- మౌలానా మహమ్మద్ సాజిద్ పాషా చిస్తి
- భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా మిలాద్ ఉన్ నబీ



నాగర్‌కర్నూల్‌లో రోగులకు పండ్లు, స్వెటర్లు పంపిణీ చేస్తున్న ముస్లింలు



అచ్చంపేట పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

నాగర్‌కర్నూల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చూపిన మార్గమే అనుసరిస్తే స్వర్గలోక ప్రాప్తి జరుగుతుందని హైదరాబాద్ జామియా నిజామియా అరబి యూనివర్సిటీ అలిమ్ ఫాజిల్ మహమ్మద్ సాజిద్ పాష చిస్తి అన్నారు. ఆదివారం రాత్రి నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని జామేమస్జీద్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ జైనలాబుద్దీన్ నక్ష్ బందీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మౌలానా మహమ్మద్ సాజిద్ పాషా చిస్తి మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త కంటే ముందు 1,24,000మంది ప్రవక్తలు భూమిపైకి వచ్చారన్నారు. చివరి ప్రవక్త అయిన మహమ్మద్ ప్రవక్త 1400సంవత్సరాల క్రితం భూమిపైకి అల్లా ఆజ్ఞతో రావడం జరిగిందన్నారు. అప్పటికీ ఖురాన్‌ను ప్రవక్తలే ప్రజలకు వివరించే వారని మహమ్మద్ ప్రవక్తపై దేవుడు అనుగ్రహించి ఖురాన్‌ను భూమిపైకి లిఖితపూర్వకంగా దించడం జరిగిందన్నారు. అనంతరం సలాం పఠనంతో కార్యక్రమాలు ముగిశాయి.

● **అన్నదానం**

మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం ఉదయం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్యేక ఫాతేహాల అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని కమిటీ బాధ్యులు ముస్లిం మత పెద్దలు ప్రారంభించారు. వందలాది మంది పాల్గొన్నారు.

● **ఆసారే ముబారక్ జియారత్**

జామే మస్జీద్‌లో భద్రపర్చిన మహమ్మద్ ప్రవక్త వస్తువులు, వెంట్రుకలను ఉదయం భక్తుల దర్శనం కోసం ఉంచారు. ప్రత్యేక ప్రార్థన భక్తుల దర్శనం కోసం మహమ్మద్ ప్రవక్త వస్తువులను ప్రదర్శించారు. మధ్యాహ్నం వరకు పురుషులకు, 2గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు మహిళలు దర్శించుకోవడానికి అవకాశం కల్పించారు.

● **మానవులంతా సమానమని చాటిన ప్రవక్త**

సమాజంలోని మానవులంతా సమానమని చాటిన గొప్ప ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అని ముస్లిం మైనార్టీ నాయకులు మహమ్మద్ హబీబుర్రహ్మాన్, మహమ్మద్ హబీబ్‌ఖాన్, మహమ్మద్ ఖాదర్‌లు అన్నారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినం పురస్కరించుకుని ప్రముఖ పుర వ్యాపారి ఖాదర్ సారథ్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులు, బాలింతలకు పండ్లు బ్రెడ్లు, చిన్న పిల్లలకు చలి కలుగకుండా స్వెటర్లను పంపిణీ చేశారు. కౌన్సిలర్ మహమ్మద్ నిజాం, సీనియర్ జర్నలిస్టు అహ్మదుల్లాఖాన్, మదర్సా కమిటీ సభ్యులు మహమ్మద్ ఆలీమ్, మహమ్మద్ ఇస్మాయిల్, యువజన నాయకులు మహమ్మద్ ఖాజా బాబా, మహమ్మద్ జహంగీర్, మహమ్మద్ రహమాన్ ఖాన్, రహీం, ఆజం పాల్గొన్నారు.

● అచ్చంపేటటౌన్: ప్రేమ సహనం శాంతి సామరస్యాలను బోధించిన మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ఈద్ మిలాద్-ఉన్-నబీ వేడుకలు సోమవారం పట్టణంలో ముస్లింలు ఘనంగా నిర్వహించారు. పర్వదినాన్ని పురష్కరించుకొని పట్టణంలో జామీ మస్జీద్ కమిటీ అధ్యక్షుడు సిద్దిక్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త శాంతి సామరస్యాలను బోధించిందన్నారు. మసీద్ కమిటీ ప్రధాన కార్యదర్శి విప్పల్‌పల్లి ఖాజా, మునిసిపల్ ఛైర్మన్ శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మహబూబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

● మన్ననూర్: అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలో మిలాదున్ నబీ పర్వదినాన్ని ముస్లింలు సోమవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం రాత్రంతా జామే మసీదులో జాగరణ చేసిన ముస్లింలు మహ్మద్ ప్రవక్త చిత్రపటంతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మసీదు కమిటీ అధ్యక్షుడు నజీరొద్దీన్, మైనార్టీ నాయకులు అజ్మత్, హసన్, రహీం, రహిమాన్, రవూఫ్, ఇస్మాయిల్, వాజీద్ అలి, జహంగీర్ అలి, రషీద్, జాకీర్, నిరంజన్, కరీమ్, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

● ఊర్కొండ: మండల కేంద్రంతో పాటు ఊర్కొండపేట, జకినాలపల్లి, రేవల్లి, మాదారం, జగబోయిన్‌పల్లి గ్రామాల్లో మిలాద్-ఉన్-నబి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో అన్నదానం నిర్వహించడంతో పాటు పుర వీధుల గుండా ర్యాలీ చేపట్టారు. మహ్మద్ షర్ఫోద్దీన్, మహ్మద్ రియాజొద్దీన్, మహ్మద్ ఖాజా, అయూబ్‌పాష, సమీ, కలీంపాష, పాష, మహముద్ తదితరులు ఉన్నారు.

జాతీయ జెండాలతో ముస్లింల భారీ ప్రదర్శన



కొల్లాపూర్‌లో జాతీయ జెండాలతో ర్యాలీ చేస్తున్న ముస్లింలు

కొల్లాపూర్, సెప్టెంబరు 16 : మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలను కొల్లాపూర్ మండలంలో ముస్లింలు ఘనంగా నిర్వహించారు. చౌనీ వీధి నుంచి ముస్లింలు జాతీయ జెండాలు చేత పట్టుకుని పట్టణ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు.

మిలాద్ ఉన్ నబీ సందర్భంగా పట్టణ ప్రజలకు మిఠాయిలు పంచి పెట్టారు. అనంతరం పట్టణంలోని జామే మస్జీద్‌లో ఆసారే ముబారక్ సందర్శించారు. అనంతరం మిలాద్ ఉన్ నబీ మహమ్మద్ ప్రవక్త జన్మదిన విశిష్టతను ముస్లిం మత పెద్దలు క్లుప్తంగా బోధించారు. అనంతరం జామే మస్జీద్‌లో మిలాద్ ఉన్ నబీ సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

● పెంట్లవెల్లి: మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని మండలంలో జటప్రోలు, పెంట్లవెల్లి తదితర గ్రామాలలో మిలాద్ ఉన్ నబీ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ముస్లింలు నమాజ్ కట్ట దగ్గర ప్రత్యేక ప్రార్థనలు చేసి అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముస్లింలు ఖలీల్, యగౌస్, ఆసీఫ్, ఏఎస్ఐ వెంకట్‌రెడ్డి, కానిస్టేబుల్ మహేష్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

● వెల్దండ: మహ్మద్ ప్రవక్త పుట్టినరోజును పురస్కరించుకుని సోమవారం మండల కేంద్రంలో ముస్లింలు మిలాద్ ఉన్‌నబీ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం గ్రామంలో ఊరేగింపును నిర్వహించారు. ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి హాజరై ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం నాయకులు రహమాన్, హలీం, రషీద్, సమీర్ బాబా, కేశమళ్ల కృష్ణ, వెంకటయ్యగౌడ్, సంజీవ్‌కుమార్, మోతీలాల్, సాదిక్, నారాయణ, తిరుపతిరెడ్డి, వలీ తదితరులు ఉన్నారు.

● అమ్రాబాద్: మహ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకొని అమ్రాబాద్ మండల కేంద్రంలోని మసీదుల వద్ద ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు ముస్లింలు మహ్మద్ ప్రవక్తను స్మరిస్తూ జాగారం చేశారు. అనంతరం సోమవారం ఉదయం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి ఈ సందర్భంగా మిఠాయిను పంపిణీ చేశారు. జామా మసీద్ కమిటీ అధ్యక్షుడు దస్తగిరి, జమీల్, ఇస్మాయిల్‌తో పాటు ముస్లిం మత పెద్దలు, యువకులు, విద్యార్థులు ఉన్నారు.



వెల్దండలో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

గంగమ్మ ఒడికి గణనాథులు

-పోటాపోటీగా సాగిన లడ్డూ వేలాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నిమజ్జన ర్యాలీలు

కల్వకుర్తి, సెప్టెంబరు 16 : పది రోజులు నిత్య పూజలందుకున్న గణనాథులు గంగమ్మ ఒడికి బయల్దేరాయి. కల్వకుర్తి పట్టణంలో వాడవాడలా మండపాల్లో ప్రతిష్ఠించిన గణనాథుల వద్ద పోటాపోటీగా లడ్డూ వేలాలు నిర్వహించారు. మండపాల వద్ద స్థానిక ప్రజాప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అట్టహాసంగా కొనసాగాయి. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో గణనాథులను పెట్టి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గంగమ్మ ఒడికి తరలించి మండపాల నిర్వాహకులు తమ భక్తిని చాటుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ బి.నాగార్జున, ఎస్‌ఐ జి.మాధవరెడ్డిల ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు తీసుకున్నారు.

● చారకొండ: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మి పద్మావతి వేంకటేశ్వర ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు ప్రతిష్ఠించిన వినాయకుని వద్ద భక్తులు భక్తిశ్రద్ధలతో నవరాత్రులు పూజలు నిర్వహించారు. సోమవారం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బ్యాండు మేళాల నడుమ నృత్యాలు, చిన్నారులు ఆటపాటలు, మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా వెళ్లి వినాయకుడిని చారకొండ సమీపంలోని చెరువులో నిమజ్జనానికి తరలించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



కల్వకుర్తిలో వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో లడ్డూ వేలంలో పాల్గొన్న నాయకులు

లట్టుపల్లిలో వినాయకుడికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

బిజినేపల్లి: లట్టుపల్లి గ్రామంలో మైల్‌స్టోన్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడికి ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. హైదరాబాద్‌కు చెందిన ఉదయ్, రమ్య దంపతులు భక్తులకు చేపట్టిన కార్యక్రమంలో వితరణ చేపట్టారు. [illegible]రుతండాలో శివాలయం, ఆంజనేయ స్వామి ఆలయాల్లో గిరిజనులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ సర్పంచ్ సాలెమ్మ, గోవిందు నాయక్, మాజీ ఎంపీటీసీ చంద్ర గౌడ్, కృష్ణనాయక్, రాజు నాయక్, మహేష్, గోపాల్ నాయక్, పీట్యానాయక్, చందులాల్, పాండు నాయక్, దీపక్, మునీందర్, సురేష్ తదితరులు ఉన్నారు.

● పెద్దకొత్తపల్లి: మండల పరిధిలోని దేవుని తిర్మలాపూర్ గ్రామంలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుని దగ్గర సోమవారం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేశారు. గణనాథునికి 9రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి గణనాథుని దగ్గర బొల్లె భాస్కర్, బొల్లె బుడ్డయ్యలు అన్నదానం నిర్వహించారు. బొల్లె విష్ణు, బొల్లె భాస్కర్, బొల్లె బుడ్డయ్య, బిజినేపల్లి కిరణ్, గోవర్ధన్, బొల్లె అశోక్, గోపాల్, బొల్లె శివబాబు, బొల్లె రమేష్, బొల్లె పెద్దబాబు పాల్గొన్నారు.



దేవునితిర్మలాపూర్ గ్రామంలో భక్తులకు అన్నదానం చేస్తున్న అంబేడ్కర్ యూత్ సభ్యులు



భక్తి శ్రద్ధలతో వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు

టీచర్స్ ప్రీమియర్ లీగ్ విజేతగా అమ్రాబాద్

అచ్చంపేటటౌన్, సెప్టెంబరు 16: పట్టణంలోని ఎన్టీఆర్ క్రీడా మైదానంలో అచ్చంపేట డివిజన్‌లోని అన్ని మండలాల ఉపాధ్యాయులు కలిసి టీచర్స్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను నిర్వహించారు. సోమవారం ఫైనల్‌లో అచ్చంపేట, అమ్రాబాద్ జట్లు తలపడగా అమ్రాబాద్ జట్టు గెలుపొంది విజేతగా నిలిచింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మునిసిపల్ ఛైర్మన్ శ్రీనివాసులు పాల్గొని అమ్రాబాద్ టీచర్ ప్రీమియర్ లీగ్ విజేత టీంకు ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు తాము ఆటలో పాల్గొంటూ విద్యార్థులకు కూడా క్రీడల్లో క్రీడా నైపుణ్యాలు నేర్పించాలని ముందు ఇంకా ఇటువంటి అన్ని రకాల ఆటలు కొనసాగాలని కోరుతున్నామన్నారు. క్రీడాకారులకు పండ్లు పంపిణీ చేసిన ఉపాధ్యాయులు సూర్య శ్రీనివాస్ గౌడ్, మంతటి శ్రీనివాసులు, క్లాస్‌మెంట్ సభ్యులు గోపాల్, వెంకట్ రాజులకు టీం సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

లాల్‌సింగ్, కృష్ణశేఖర్, నిరంజన్, రామ్ గోపాల్, తిరుపతయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



టీచర్స్ ప్రీమియర్ లీగ్ విజేతగా నిలిచిన అమ్రాబాద్ టీం

బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి



శ్రీకాంత్‌రెడ్డిని సన్మానిస్తున్న బ్యాంగి ఆనంద్‌కుమార్

కల్వకుర్తి, సెప్టెంబరు 16 : తెలంగాణ స్టేట్ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడుగా కల్వకుర్తికి చెందిన చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి నియమితులయ్యారు. సోమవారం కల్వకుర్తి పట్టణంలో మాజీ సర్పంచ్ బ్యాంగి ఆనంద్‌కుమార్, పలువురు నాయకులు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డిని పూల మాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. బాల్ బ్యాడ్మింటన్ క్రీడాభివృద్ధికి తమ సహాయ సహకారాలుంటాయని ఆయన పేర్కొన్నారు. సన్మానించిన వారిలో కాంగ్రెస్ నాయకులు షానవాజ్‌ఖాన్, పసుల శ్రీధర్‌రెడ్డి, మిరియాల శ్రీనివాస్ రెడ్డి, పుస్తకాల రాహుల్, మిరియాల దామోదర్‌రెడ్డి, వి.భాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కొరటికల్‌లో అన్నదానం

ఉప్పునుంతల, సెప్టెంబరు 16: మండల పరిధిలోని కొరటికల్ గ్రామంలో సోమవారం స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదం తీసుకున్నారు. మంగళ వారం వినాయక నిమజ్జన కార్యక్రమం ఉంటుందని స్వామి వివేకానంద యూత్ నిర్వాహకులుమల్లయ్య, రాజు తెలిపారు.

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయండి

కోడేరు, సెప్టెంబరు 16 : కమ్యూనిస్టు పార్టీ ఎర్రజెండా నాయకత్వంలో వెట్టి చాకిరీ, అంటరానితనం గ్రామాల్లో భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి పి.నరసింహ ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో అంబేడ్కర్ విగ్రహం ముందు తెలంగాణ విలీన దినం వాస్తవాలు వక్రీకరణలు అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. సీపీఎం నాయకులు పి.రవి, వి.రవి, వి.రాజేష్, వి.రాజు. రజక సంఘం మండల నాయకుడు రవి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు ఏటిగడ్డ చంద్రయ్య, గ్రామ నాయకులు పొడేండ్ల మధు, నాగులపల్లి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'గృహజ్యోతి'కి దరఖాస్తు చేసుకోండి

అచ్చంపేటటౌన్, సెప్టెంబరు 16: గృహజ్యోతి పథకం అందని లబ్ధిదారులు మళ్లీ దరఖాస్తులు చేసుకునేందుకు మరో అవకాశం వచ్చిందని విద్యుత్ ఏఈ ఆంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని గ్రామాలకు చెందిన వారు మండల పరిషత్ కార్యాలయంలో, పట్టణ ప్రజలు మునిసిపాలిటీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రజా సమస్యలు గుర్తించి పని చేయండి

తెలకపల్లి, సెప్టెంబరు 16 : గ్రామాల్లో ప్రజా సమస్యలను గుర్తించి పార్టీ కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌శ్రీనివాసులు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని కార్వంగ గ్రామంలో సీపీఎం గ్రామ శాఖ మహాసభల సందర్భంగా జెండా ఎగురవేసి అనంతరం సభలనుద్దేశించి ఆయన మాట్లాడారు. అనంతరం గ్రామ శాఖ నూతన కమిటీ కార్యదర్శిగా గోపాస్‌లక్ష్మణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీపీఎం నాయకులు నందిపేట భాస్కర్, గోరటి కాశన్న, కృష్ణయ్య, ఆంజనేయులు, గాజుల శంకర్, మహిళలుపాల్గొన్నారు.

సీపీఎం జెండా ఆవిష్కరణ

వంగూరు, సెప్టెంబరు 16: మండలంలోని పోల్కంపల్లిలో సోమవారం సీపీఎం జెండాను జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆంజనేయులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టజీవులకు అండ ఎర్ర జెండా అని, దోపిడీ ఉన్నంత వరకు ఎర్రజెండా ఉంటుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పేద ప్రజల పక్షాన పోరాటం చేస్తుందన్నారు. మండల కార్యదర్శి బాలస్వామి, హుస్సేన్‌గౌడ్, శివరాములు, రాములు, మల్లయ్య, జంగయ్య తదితరులు

హనుమాన్ దేవాలయంలో లడ్డూ ధర రూ.4,51,000



పట్టణంలోని శ్రీసీతారామాంజనేయస్వామి దేవాలయం లడ్డూను దక్కించుకున్న నరేష్ యాదవ్

కల్వకుర్తిటౌన్, సెప్టెంబర్ 16: కల్వకుర్తి పట్టణంలోని శ్రీసీతారామాంజనేస్వామి దేవాలమంలో వినాయక లడ్డూ గతంలో ఎన్నడులేని విధంగా రికార్డు ధర పలికింది. సోమవారం నిమజ్జనం సందర్భంగా నిర్వహించిన వేలం పాటలో వంగూర్ మండలం కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఎడ్ల నరేష్ యాదవ్ మూడవసారి లడ్డూను దక్కించుకున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. రూ.4,51,000లకు దక్కించుకున్నట్లు వారు వివరించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు లడ్డూ అందజేసి శాలువాతో సత్కరించారు. మునిసిపల్ ఛైర్మన్ ఎడ్మ సత్యం, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యానగర్‌లో రూ.లక్షా పదహారు వేలకు..

కల్వకుర్తి పట్టణంలోని విద్యానగర్ (కేశవనగర్ కాలనీలోని) ఏర్పాటుచేసిన వినాయమండపం వద్ద సోమవారం జరిగిన లడ్డూ వేలం పాటలో మొదటి లడ్డూను డాక్టర్ బాలు రూ.లక్షాపదహారు వేలకు దక్కించుకోగా, రెండో లడ్డూను శ్రీనివాస్ గౌడు రూ.52 వేలకు, స్వామివారికి కలషం, కండువాను జయప్రద రూ, 20వేలకు, చిన్న కండువాను రవీం దర్‌రెడ్డి రూ.14వేలకు స్వామివారికి దగ్గర ఉంచిన పండ్లను న ర్సింహ రూ. 23 వేలకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ మండలి సభ్యులు వా రిని ఘనంగా శాలు వాలు పూలమాలలతో సత్కరించారు. కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాభివృద్ధికి ఆర్థిక సాయం

కల్వకుర్తిటౌన్, సెప్టెంబర్ 16 : కల్వకుర్తిపట్టణంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయాభివృద్ధికి పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు భవాండ్లమధు ఆర్థిక సాయం అందజేశారు. రూ. 50,520లను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వేణుగోపాలచారి, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, సభ్యులు రమేశ్‌చారి, శ్రీనివాసాచారి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.